క్లుప్తంగా

మానసాదేవి ఆలయంలో ఘనంగా పూజలు


పూజలందుకుంటున్న శ్రీ మానసాదేవి అమ్మవారు

చీపురుపల్లి: మండలంలోని రామలింగాపురం పంచాయతీ పరిధి పుర్రేయవలస పరిసరాల్లో ఉన్న శ్రీ మానసాదేవి నాగశక్తి అమ్మవారి ఆలయంలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచే శ్రీ మానసాదేవి నాగశక్తి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో దేవస్థానం కిటకిటలాడింది. ఆలయ ధర్మకర్తలు పిన్నింటి అప్పలనాయుడు, శ్రీను, శివలు నేతృత్వంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

రైతులందరికి వరి విత్తనాలు


విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో

గుర్ల: రైతులందరికి రాయితీ వరి విత్తనాలు అందజేస్తామని ఏవో ఎం.తిరుపతిరావు అన్నారు. మండలంలోని దమరసింగి రైతు సేవా కేంద్రం వద్ద రాయితీ విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు. . విత్తనాలను సూడోమోనస్‌తో కలిపి నారు మడులలో వేయాలని సూచించారు. విత్తనాలను పంపిణీ చేసిన వారిలో స్థానిక నేతలు మీసాల ప్రసాద్, పి.రాజారావు ఉన్నారు.

సామగ్రి వితరణ


లక్ష్మీపురంలో సిమెంట్ బెంచీలు ప్రారంభిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

జామి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో మరిడమ్మ ఆలయం వద్ద మంగళవారం ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ నేతృత్వంలో జాగరం వాసవిక్లబ్ అధ్యక్షుడు యిండుపూరి ప్రసాద్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా రెండు బెంచీలు, గరుకు స్తంభం, పలువురు రైతులకు వ్యవసాయ పనిముట్లు అందించారు. రైతులకు, విశ్రాంతి ఆర్మీ ఉద్యోగిని సన్మానించారు. గ్రామంలో కొంతమందికి గొడుగులు తదితర సామగ్రి అందించారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో సచివాలయ సందర్శన


ఆతవ సచివాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో

వేపాడ: గ్రామ సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతతో విధులు నిర్వహించాలని ఎంపీడీవో సిహెచ్.సూర్యనారాయణ సూచించారు. మంగళవారం ఆతవ గ్రామ సచివాలయాన్ని సందర్శించిన ఆయన రికార్డులు, హాజరు తదితర రిజిస్టర్లు పరిశీలించారు. గ్రామంలో నిర్మాణంలో వున్న రైతు సేవా కేంద్రం, వెల్‌నెస్ భవనాలు పరిశీలించారు. సిబ్బంది ఎప్పటికప్పుడు నివేదికలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేమన నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారిగా వెంకటరమణ


దత్తిరాజేరు: మండల కేంద్రమైన దత్తిరాజేరు పీహెచ్‌సీ రెండో వైద్యాధికారిగా వెంకటరమణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మన్యం జిల్లా పాచిపెంట పీహెచ్‌సీ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

సికిల్‌సెల్ వ్యాధిపై అవగాహన


అప్పన్నదొరపాలెంలో అవగాహన ర్యాలీ

కొత్తవలస : మండలంలోని అప్పన్నదొరపాలెం గ్రామంలో సికిల్‌సెల్ అనీమియా (జన్యుపరమైన వ్యాధి)పై అవగాహన కార్యక్రమాన్ని కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్ వర్మ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సికిల్‌సెల్ అనీమియా వంశపార్యపరంగా వచ్చే రక్తహీనతకు సంబంధించిన వ్యాధి అని తెలిపారు. దీని వలన శరీరంలో రక్తహీనత ఏర్పడి అలసట, ఆయాసం, పచ్చకామెర్లు, గుండెపోటు వ్యాధులు వచ్చే అవకాశం వుందన్నారు. ఈ వ్యాధి నిర్ధారణపై ప్రతీ గ్రామంలో రక్తహీనతకు సంబంధించి రక్త పరీక్షలు చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జోడి రాములమ్మ, ఎంపీటీసీ ఉగ్గిన రాంబాబు, వైస్ సర్పంచ్ సుంకరి అక్కయ్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దు


విద్యార్థులకు మత్తు పానీయాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ


గంట్యాడ: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ విజయలక్ష్మి


మెయిన్‌రోడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ, ఎస్‌ఐ తదితరులు

గజపతినగరం : బంగారు భవిష్యత్‌ను నాశనం చేసే మాదక ద్రవ్యాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని గజపతినగరం ఎక్సైజ్ శాఖ ఎస్‌ఐ పి.ఉపేంద్ర తెలిపారు. మంగళవారం గజపతినగరం మదుర గ్రామం ఎమ్.వెంకటాపురం గ్రామంలో జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వినియోగం వలన కలిగే అనర్థాలను గురించి వివరించారు. చదువుతున్న కాలంలో ఎటువంటి చెడు అలవాట్లకు లోనవకుండా ప్రతీ ఒక్కరు తమ భవిష్యత్‌ను బంగారు భవిష్యత్‌గా తీర్చి దిద్దుకునేందుకు చదువు పైనే దృష్టి సారించాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శంకరరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు

గంట్యాడ: విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని సీఐ ఎం.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కొఠారుబిల్లి జంక్షన్‌లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మాదక ద్రవ్యాల వాడడం వల్ల జీవితాలు నాశనం అవుతాయన్నారు. అనారోగ్య సమస్యలు బారిన కూడా పడతారన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల జోలికి పోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎక్సైజ్ ఎస్.ఐ ఆర్.సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ జగన్నాధరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలసలో..

కొత్తవలస : మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా వుండాలని ఎక్సైజ్ శాఖ సీఐ రాజశేఖరనాయుడు సూచించారు. మండల కేంద్రంలోని డిఫెన్స్ అకాడమీలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల సేవనం వ్యతిరేక దినోత్సవంలో భాగంగా మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు సీఐ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు చిత్తు

చీపురుపల్లి: మాదకద్రవ్యాలు వినియోగంతో జీవితాలు చిత్తవుతాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ చక్రవర్తి చెప్పారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఆర్‌టీసీ కాంప్లెక్సు నుంచి మెయిన్ రోడ్‌లో ఆటో డ్రైవర్లు, స్థానికులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు ప్రతీ ఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనమైపోతాయని చెప్పారు. ఆరోగ్యాలు నాశనమవ్వడమే కాకుండా ఇంటి పెద్దలపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. అంతేకాకుండా మాదక ద్రవ్యాలు వినియోగించినా, రవాణా చేసినా పట్టుబడితే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జి.గిరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వహించాలి

- జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారిణి డా.అచ్చుతకుమారి


పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాధికారిణి డా.అచ్చుతకుమారి

వేపాడ: ఆరోగ్య సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించటంతో పాటు ఎప్పటికప్పుడు యాప్‌లో వివరాలను నమోదు చేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారిణి డా.అచ్చుతకుమారి ఆరోగ్య సిబ్బందికి సూచించారు. వేపాడ పీహెచ్‌సీని ఆమె మంగళవారం సందర్శించారు. ముందుగా ఆసుపత్రిలో ఓపీ పరిశీలించారు. అనంతరం స్టాకు రూమ్, వ్యాక్సిన్ కిట్లు, వ్యాక్సిన్ రికార్డులు పరిశీలించిన ఆమె ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలతో విడివిడిగా సమీక్షించారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతీ బుధ, శనివారాల్లో వేసే వ్యాక్సినేషన్ డ్రాపౌట్స్‌ను గుర్తించి వ్యాక్సినేషన్ వేయాలన్నారు. ఈ నెల 28 వరకు వేసే ఎం.ఆర్. వ్యాక్సిన్ శతశాతం పూర్తి చేయాలని సూచించారు. ఇతర పది రకాలకు సంబంధించి వ్యాక్సిన్ డ్రాపౌట్‌లకు వ్యాక్సిన్ వేయాలన్నారు. స్టాఫ్ డయేరియా ప్రోగ్రాంలో భాగంగా ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్‌ఎస్. జింక్ మాత్రలు అందుబాటులో వుంచాలని సూచించారు. సిబ్బంది యాప్‌లు అప్‌లోడ్ చేసే సమయంలో ఎటువంటి సాంకేతిక సమస్యలు ఇతరత్రా అనుమానాలు వుంటే నివృత్తి చేసుకుని ఎప్పటికప్పుడు యాప్‌లో నివేదికలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎస్‌హెచ్‌ఓ భరత్, పార్మాసిస్టు ఎస్‌వీఎస్ సత్యనారాయణ వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.వేణు, ఎ.సంజనా తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం


బదిలీపై వెళ్లిన బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎంను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

చీపురుపల్లి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన 21 మంది ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల ఉపాధ్యాయుల బదిలీల్లో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్‌తో పాటు మరో 20 మంది ఉపాధ్యాయులకు బదిలీ అయ్యింది. దీంతో ఇతర పాఠశాలల నుంచి 11 మంది ఉపాధ్యాయులు బదిలీపై ఇక్కడి పాఠశాలకు వచ్చారు. దీంతో ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిన వారికి సత్కరించారు.

వేపాడలో..

వేపాడ: మండలంలో జాకేరు ఎంపీయూపీ పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ముగ్గురు ఉపాధ్యాయులను గ్రామ సర్పంచ్ దంపతులు బుద్దాచిన్నమ్మలు అప్పలనాయుడు, పాఠశాల ఎస్‌ఎమ్‌సీ చైర్మన్ వాసుదేవరావు, తదితరులు మంగళవారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన రావాడ రామసత్యం, రెడ్డి అప్పలసత్యం, బి.అప్పారావు మాస్టార్లను ఉపాధ్యాయులు దాసరి సత్యవతి, పుష్ప, సత్యవతి, గ్రామపెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

28న మండల సమావేశం

మెరకముడిదాం: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 28న ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో గొర్లె భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరు కానున్నట్టు పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు. సభ్యులు హాజరు కావాలని కోరారు.

మిగులు సీట్ల భర్తీకి పరీక్ష

వేపాడ: వేపాడ ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి సంబంధించి మంగళవారం ప్రవేశ అర్హత పరీక్ష నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వర్రావు మంగళవారం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి తరగతి వారి మిగిలిన సీట్లకు నిర్వహించిన పరీక్షలో 65 మంది పరీక్ష రాసినట్లు చెప్పారు. ఆరో తరగతిలో 15 సీట్లు వుండగా 9 మంది, ఏడో తరగతిలో 16 సీట్లుకు 14 మంది, ఎనిమిదో తరగతిలో 16 సీట్లకు 14 మంది, తొమ్మిదో తరగతిలో 23 మందికి 18 మంది పరీక్షలు రాసినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

జేష్టమాస ప్రత్యేక పూజలు


ఓం సదనం ఆశ్రమంలో 108 శివలింగాలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలను నిర్వహిస్తున్న ఉమామహేశ్వరశర్మ

కొత్తవలస /లక్కవరపుకోట : జేష్టమాస మాస శివరాత్రి, కృష్ణ అంగారక చతుర్దశి సందర్భంగా కొత్తవలస, లక్కవరపుకోట మండలాల్లో ప్రత్యేక పూజలను మంగళవారం నిర్వహించారు. కొత్తవలస మండలం తుమ్మికాపల్లి గేటు సమీపంలో గల ఓం సదనం ఆశ్రమంలో గల 108 శివలింగాలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన, నవగ్రహ పూజలు, హోమాలు బహ్మశ్రీ అంపోలు ఉమామహేశ్వరశర్మ, కిరణ్‌కుమార్‌శర్మల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. లక్కవరపుకోట మండల కేంద్రంలో గల వీరభద్రస్వామి ఆలయంలో వేదపండితులు ఎ.శ్రీహరి శర్మ ఆధ్వర్యంలో సామూహిక రుద్రాభిషేకాలను నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

పంటల బీమా చేయించుకోవాలి


అట్టాడలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో

జామి: రైతులు తప్పనిసరిగా పంటల బీమా చెల్లించాలని ఏవో ఎం.పూర్ణిమ తెలిపారు. మండలంలోని అట్టాడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటల బీమా కోసం వరికి ఎకరాకు రు.200 ఆగస్టు 15లోగా చెల్లించాలన్నారు. మొక్కజొన్న పంటకు రూ.165,, నువ్వు పంటకు రూ.65, జూలై 31 లోగా చెల్లించాలన్నారు. రైతులు ఈఅ వకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విత్తన శుద్ధి, మొలక శాతం, కాలిబాటలు, యాజమాన్య పద్ధతులు, నారుమడి తయారీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. అనంతరం రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏఏ తేజ పలువురు రైతులు పాల్గొన్నారు.

పాఠశాల భవనాల మరమ్మతులు ప్రారంభం


ప్రస్తుతం భవనాలకు చేపడుతున్న మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్

లక్కవరపుకోట : మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గల జూనియర్ కళాశాలకు కేటాయించిన భవనాలు వినియోగానికి అధికారులు చర్యలు చేపట్టారు. సాక్షి పత్రికలో ఈ నెల 16వ తేదిన జూనియర్ కళాశాల ఏర్పాటయ్యేనా...? శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు కాకపోవడంతో ఈ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయని స్థానిక జిల్లా పరిషత్ హెచ్‌ఎం వేణుగోపాలరావు తెలిపారు. ప్రస్తుతం ఈ భవనాలను స్కూల్ నిర్వహణ నిధులతో మరమ్మతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ భవనాలు పూర్తయిన వెంటనే స్కూల్ కాంప్లెక్ సమావేశాల నిర్వహణకు వినియోగిస్తామని తెలిపారు.


సాక్షి
జూనియర్ కళాశాల ఏర్పాటయ్యేనా..?

ఈ నెల 16న సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనం

5న మెగా లోక్ అదాలత్


పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయ్ రాజ్‌కుమార్

గజపతినగరం రూరల్: జూలై 5వ తేదీన జరగనున్న మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు పోలీసు శాఖ సిబ్బంది సహకరించాలని గజపతినగరం జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ విజయ్ రాజ్ కుమార్ కోరారు. మంగళవారం కోర్టు ఆవరణలో తన చాంబర్‌లో గజపతినగరం పోలీసు సిబ్బందితో ఆయన మాట్లాడారు. కక్ష్యదారుల్లో రాజీయే రాజమార్గమని అవగాహన కలిగించి అధిక శాతం కేసులు పరిష్కరించేందుకు సహకరించాలన్నారు. ఇప్పటి నుంచే కక్ష్యదారులకు అవగాహన కలిగించడం మొదలు పెట్టాలన్నారు. సమావేశంలో స్థానిక పోలీసులతో పాటు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ను రద్దు చేయాలి


పురిటిపెంట ఈవోకు సమ్మె నోటీసు అందజేస్తున్న యూనియన్ సభ్యులు

గజపతినగరం రూరల్: లేబర్ కోడ్‌ను రద్దు చేస్తూ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.21వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మీ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పురిటిపెంట, గజపతినగరం పంచాయతీ కార్యదర్శులకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెల 9న దేశ వ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెలో పంచాయతీ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా మార్చే నాలుగు లేబర్‌కోడ్‌లను తక్షణమే ప్రభుత్వాలు రద్దు చేయాలన్నారు. మహిళా కార్మికులు రోజుకు 8గంటలు మాత్రమే పని చేసేలా ప్రభుత్వాలు ఇచ్చిన జీవోను రద్దు చేస్తూ 12 గంటలు పని చేయాలని డిమాండ్ చేస్తున్న ప్రభుత్వ తీరును తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.కనకరాజు, ఇ.కోటేశ్వరరావు, బి.గోవింద, కె.రాము, బి.అప్పలస్వామి, గణేష్, మహంకాళి అప్పలరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో విత్తనాలు వేయాలి


రైతులకు చోడి విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏవో

దత్తిరాజేరు: వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు వరి విత్తనాలు వేయాలని ఏవో అనురాధ అన్నారు. మంగళవారం ఆర్ రామచంద్రాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. 30 కేజీల వరి విత్తనాలకు 250 గ్రాములు సుడోమోనాస్‌తో విత్తన శుద్ధి చేసి విత్తనాలు వేయడం వలన భూమి నుంచి సంక్రమించే తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకోవచ్చునని అన్నారు. అనంతరం రైతులకు చోడి చిరు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏఏ రాము, రైతులు పాల్గొన్నారు.

బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి

వీరఘట్టం: ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు ముందుగా ఎంపిక చేసిన విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసుకోవాలని ఏవో జక్కువ సౌజన్య సూచించారు. మంగళవారం చలివేంద్రి గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. సేంద్రీయ పద్ధతిలో వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తే ఖర్చులను ఆదా చేయవచ్చునని సూచించారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు సబ్సిడీపై వచ్చిన వరి విత్తనాలను పంపిణీ చేశారు.

సాదాసీదాగా సమావేశం


ఎస్.,కోట పంచాయతీ సమావేశానికి హాజరైన సభ్యులు, సర్పంచ్ తదితరులు

శృంగవరపుకోట: స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈవో అనురాధ ఆధ్వర్యంలో సర్పంచ్ సంతోషికుమారి అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశం సాదాసీదాగా ముగిసింది. సమావేశంలో ఈవో పది అంశాలతో ఉన్న అజెండాను ప్రవేశపెట్టారు. వార్డు సభ్యుడు సీహెచ్ శేషగిరి మాట్లాడుతూ శ్మశానంలో రహదారి లేదు.. లైట్లు లేవు..ఆర్‌డబ్ల్యూఎస్‌కు ఇచ్చిన ప్రతిపాదనలు పడకేశాయి. ఒక్క పనీ కాలేదు. పాఠశాల ప్రహరీకి ఆనుకొని ఉన్న దుకాణాలు తీయించేశారు. డ్రైన్ ఏర్పాటు చేశారు. ఆసుపత్రి పక్కన గెడ్డ, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కొందరు ఇల్లు కట్టేస్తున్నారు. ఉన్న రెండు బస్ షెల్టర్లు పీకేశారు. కొత్తవి కట్టలేదు. పట్టించుకోరా.. అంటూ ప్రశ్నించారు.ప్రధాన రహదారిలో ఉన్న మురుగునీటి సమస్య పరిష్కరించకుండా రహదారి మనది కాదన్నట్టు అధికారులు సమాధానం చెప్పడం సరికాదని ఉప సర్పంచ్ మోపాడ కుమార్ అన్నారు. పట్టణంలో పలుచోట్ల అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేస్తున్నారని ఎవరూ పట్టించుకున్న దాఖలేవని పలువురు సభ్యులు మండిపడ్డారు. సమావేశంలో పలువురు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

జేడీ వలసలో వైద్య శిబిరం


జేడీవలసలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

జామి: మండలంలోని జె.డి.వలస గ్రామంలో మంగళవారం సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. నెల్లిమర్ల మిమ్స్ ఆసుపత్రి వైద్య సిబ్బంది శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. శిబిరంలో నేత్ర వైద్య పరీక్షలు, ఆర్థో, కేన్సర్, డెంటల్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 80 మంది రోగులు హాజరయ్యారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిటికిరెడ్డి రామునాయుడు, పలువురు పెద్దలు, సత్యసాయిబాబా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి పలువురి ఎంపిక


ఎం.వెంకటలక్ష్మి


టి.అశ్వినికుమార్


మామిడి పల్లవి


తెరపల్లి రోషిణి

మెరకముడిదాం: మండలంలోని గర్భాం ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన 10 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఇందులో పాఠశాలకు చెందిన ఎం.వెంకటలక్ష్మి, బి.సుజాత, జె.పూజితషాలిని, పి.షైలజ, పి.సృజన, ఎస్.నిఖిత, టి.అశ్వినికుమార్, టి.రావల్లిక, టి.యామిని, వి.కావ్యశ్రీలు ఉన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ డి.వి.ఎస్.అరుణ, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినిలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని హెచ్.ఎం పి.వి.రామ్‌కుమార్ చెప్పారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన తెరపల్లి రోషిణి నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైందని, పాఠశాల స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన మామిడి పల్లవి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికై ందని హెచ్.ఎం చెప్పారు.

భూములిచ్చి రోడ్డున పడ్డాం..


ఎమ్మెల్సీ ఇంట్లో నిర్వాసితులతో మాట్లాడుతున్న రఘురాజు, కాంగ్రెస్ నేతలు

- మాకు న్యాయం చేయాలి
- ఎమ్మెల్సీ రఘురాజుకు జిందాల్ నిర్వాసితుల వినతి

శృంగవరపుకోట: భూములు ఇచ్చి ఉపాధి, ఉద్యోగం లేక రోడ్డున పడ్డ తమకు న్యాయం జరిగేలా చూడాలని ఐదు పంచాయతీలకు చెందిన జిందాల్ నిర్వాసితులు ఎమ్మెల్సీ రఘురాజుకువిన్నవించారు. బొడ్డవరలో ఎమ్మెల్సీ రఘురాజు తన నివాసంలో నిర్వాసితులతో మంగళవారం సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ 2013 భూహక్కు చట్టం ప్రకారం పరిశ్రమలు ఏర్పాటు చేయకుంటే భూములు మళ్లీ రైతులకే ఇవ్వాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసిందన్నారు. 2009 నుంచి రూ.10వేలు వేతనం ఇస్తామని రూ.2200 ఇచ్చి మోసం చేశారని చెప్పారు. వాస్తవాలు ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లాలని, తనతో పాటూ అన్ని పార్టీల నేతల్ని కలుపుకుని ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంల దృష్టికి సమస్య తీసుకువెళ్తామని చెప్పారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా పోరాటం చేస్తామని, జిందాల్ నిర్వాసితుల పోరాటానికి రాజకీయ రంగులు పులిమే వాళ్లు రైతుల ఆకలి కేకలు గుర్తించాలని కోరారు. నిర్వాసితులతో కలిసి ర్యాలీగా వెళ్తుండగా పోలీసులు అడ్డుకోవటంతో వెనుదిరిగారు. జిందాల్ నిర్వాసితుల పోరాటానికి తమ మద్దతు ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ చెప్పారు. ఆయన వెంట కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ డా.గేదెల తిరుపతి తదితరులు ఉన్నారు.